క్లుప్తంగా

తహసీల్దార్‌కు సీపీఐ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని మోడల్ చెరువు ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని శనివారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బామండ్లపెల్లి యుగేందర్, కిన్నెర మల్లవ్వ తహసీల్దార్ కోమల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రియల్ ఎస్టేట్ మాఫియా కబ్జా చేయకుండా కాపాడాలని కోరారు. చెరువును రక్షించాలని, చెరువులో నిర్మించిన గోడను కూల్చివేయాలని లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామారపు వెంకటేశ్, కొముర్లెల్లి మల్లు, కొట్టె అంజలి, రజిత, రాజు, నర్సయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వేపై రైతుల ఆగ్రహం



వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శనివారం పంటల సర్వే సక్రమంగా చేయడం లేదని వ్యవసాయాధికారులను రైతులు ప్రశ్నించారు. కొందరు రైతుల పంటలను మాత్రమే సర్వే చేసి మిగతావారివి చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతిరైతు పంటను పరిశీలించాలని కోరారు. ఏఈవో సంపత్ మాట్లాడుతూ.. అధికారుల సూచనలతో నష్టపోయిన పంటల వివరాలు సేకరిస్తున్నామని, రైతుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కేసుల పరిష్కారంపై చర్చ



చర్చిస్తున్న ప్రాసిక్యూటర్లు, పోలీసులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని కోర్టు సముదాయాల సమావేశ మందిరంలో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వుల మేరకు కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఏసీపీ వెంకట్‌రెడ్డి, అడిషనల్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–2 శరత్, ఫస్ట్ అడిషనల్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గాయత్రి చర్చించారు. బాధితులకు సత్వర న్యాయం, వారెంట్ల అమలు, కేసుల సత్వర పరిష్కారం, న్యాయ, చట్టపరమైన విషయాలను వివరించారు. సమావేశంలో సీఐలు సురేష్, జనార్దన్, ఎస్ఐలు రాజన్న, యూనస్, శేఖర్, చంద్రశేఖర్, తిరుపతి, ఆరోగ్యం, పోలీస్ స్టేషన్ల కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



గ్రామస్తులతో భోజనం చేస్తున్న ఎంపీపీ

చొప్పదండి: ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, గ్రామాల్లో ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని ఎంపీపీ చిలుక రవీందర్ సూచించారు. మండలంలోని చాకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఎంపీపీ మాట్లాడారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ మంగ, ఉపసర్పంచ్ భూపాల్‌రెడ్డి, ఆర్ఐ త్రిపాల్ సింగ్, ఏఎస్ఐ రాజయ్య, పెద్ది శ్రీనివాస్, రాజయ్య, అనిల్ పాల్గొన్నారు.

జోడో యాత్రతో ప్రధాని మోదీకి భయం పట్టుకుంది

సైదాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దురహంకార పాలన సాగిస్తోందని, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడో యాత్రతో ప్రధాని నరేంద్ర మోదీకి భయం పట్టుకుందని, ప్రజల ఓట్లతో గెలిచిన పార్లమెంట్ సభ్యుడి సభ్యత్వం రద్దు చేయడం మోదీ దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో శనివారం హనుమాన్ మాలధారణ భక్తులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వీధుల్లో యాత్ర కొనసాగింది.

స్టడీ టూర్.. నాలెడ్జ్ మోర్

- పది రాష్ట్రాల్లో పర్యటించిన రామంచ పాఠశాల విద్యార్థులు
- విజ్ఞాన, విహార యాత్రల్లో రాణిస్తున్న వైనం
- 16 మందికి ప్రధానమంత్రి షీల్డ్‌లు, 12 మందికి గవర్నర్ అవార్డులు

చిగురుమామిడి: మండలంలోని రామంచ పాఠశాల విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్షేత్రస్థాయి సందర్శనలతో విజ్ఞానం పెంపొందించుకుంటున్నారు. పరిశోధన పరిజ్ఞానం, లోతైన అవగాహనతో ముందుకు వెళ్తూ వివిధ అంశంలపై పట్టుసాధిస్తున్నారు. పాఠశాలలోని ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడెన్స్‌లో వివిధ రాష్ట్రాలలో పర్యటిస్తున్నారు. చదువుకున్న అంశాల క్షేత్రపరిశీలనకు 2007 నుంచి 2023 వరకు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ్‌బెంగాల్, రాజస్తాన్ రాష్ట్రాల్లో పర్యటించారు. హిందీ భాషా పండితుడు ఎండీ షరీఫ్‌అహ్మద్ నేతృత్వంలో విద్యార్థులు విద్యా, విజ్ఞాన, విహార యాత్రలతో ప్రజల జీవనశైలి, భౌగోళిక వాతావరణ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు.

- 2007లో మధ్యప్రదేశ్‌లోని సాత్పూరా పర్వతాల్లో విద్యార్థుల్లో వారంరోజులు సాహస యాత్ర నిర్వహించారు.
- 2008లో కూడా విద్యార్థులు రెండోసారి తమ ప్రతిభ కనబరిచారు.
- 2009లో హర్యానాలో నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు వారంరోజులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. 2010లో కూడా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రదర్శించారు.
- 2011లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా సామాజిక చైతన్య సేవా కార్యక్రమాలకు అవార్డు లభించింది. ఉత్తరాఖండ్‌లో విద్యార్థులు పర్వతారోహణ చేశారు.



ఢిల్లీలో ఎర్రకోట వద్ద విద్యార్థులు

- 2012–16 వరకు వరుసగా కర్ణాటక, కేరళలో రాష్ట్రపతి అవార్డు టెస్టింగ్ క్యాంపులో పాల్గొన్నారు. క్యాంపులో ఐదుగురికి ఒక విద్యార్థి కొమిరె అజయ్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికై ధృవపత్రం అందుకున్నాడు.
- 2017–2019 వరకు రాష్ట్రస్థాయిలో విద్యార్థులు అనేక కార్యక్రమాలు పాల్గొన్నారు. 2017లో మైసూర్‌లో జాతీయ జంబోరి కార్యక్రమంలో స్టాఫ్‌సభ్యుడిగా హిందీ పండింట్, స్కౌట్ మాస్టర్ ఎండీ షరీఫ్‌అహ్మద్ సేవలందించారు. 2019లో రాష్ట్రంలోనే మొట్టమొదటి లీడర్ ట్రైనర్‌గా షరీఫ్‌అహ్మద్ అర్హత సాధించారు. గవర్నర్ తమిళిసై చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.
- 2022వలో ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన అడ్వెంచర్ టూర్‌లో షరీఫ్‌అహ్మద్ సహాయక సిబ్బందిగా సేవలందించారు.



కొలోంబో బ్రిడ్జి క్రాసింగ్ చేస్తున్న విద్యార్థి

- 2023లో హర్యానాలో జాతీయ సాహసయాత్రలో విద్యార్థులు ప్రతిభను కనబరిచారు.

విజ్ఞాన, విహార యాత్రలకు పదిహేనేళ్లలో ఒకే పాఠశాల నుంచి 40 విద్యార్థులను షరీఫ్‌అహ్మద్ తీసుకెళ్లారు. తాజ్‌మహల్, ఆగ్రా పోర్టు, ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియాగేట్, పార్లమెంట్, రాష్ట్రపతి భవన్, కుతుబ్‌మినార్, లోటస్ టెంపుల్, జాతిపిత మహాత్మా గాంధీతోపాటు ఇందిరాగాంధీ మ్యూజియం, సమాధులను సందర్శించారు. 16 విద్యార్థులు భారత ప్రధానమంత్రి షీల్డ్‌లను సాధించారు. అలాగే మరో 12 మంది విద్యార్థులు రాష్ట్ర గవర్నర్ అవార్డులు సాధించారు. ఒక విద్యార్థిని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలో ద్వితీయ బహుమతి, నగదు పారితోషికం, సర్టిఫికెట్ అందుకోవడం విశేషం.



బ్యాలెన్సింగ్ టైర్ జంప్ చేస్తున్న విద్యార్థులు



హర్యానా రాష్ట్రంలోని విద్యార్థులతో

సాక్షి ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు

పాఠశాలలో పనిచేస్తున్న హిందీ మాస్టర్, స్కౌట్స్ టీచర్ ఎండీ షరీఫ్‌అహ్మద్ స్కౌట్ శిక్షణతో పాటు హిందీ భాషాబోధనలో మొట్టమొదటగా డిజిటల్ పాఠ్యాంశాలను రూపొందించారు. 2011 నుంచి ఐసీడీ ద్వారా విద్యాబోధన చేస్తున్నందుకు 'సాక్షి' దినపత్రిక యాజమాన్యం ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్–2014 అవార్డును బహూకరించింది.

నేడు విద్యుత్ అంతరాయం

చొప్పదండి: పట్టణంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భూమయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని బోర్నపల్లి సబ్‌స్టేషన్‌లో 11 కేవీ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ఊశయ్య సేవలు మరువలేనివి



దంపతులను సన్మానిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా సేవలు అందించిన మైస ఊశయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేశారని, ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. అనంతరం ఊశయ్య దంపతులను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశినికోటి, కౌన్సిలర్లు మారపల్లి భిక్షపతి, గాజుల శ్రీనివాస్, దిడ్డి రాము, దయ్యాల శ్రీనివాస్,దేశిని సదానందం,భోగం వెంకటేష్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రామడుగు: ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో కస్తూరి



సైదాపూర్‌లో చిన్నారులకు అన్నప్రాసన

సైదాపూర్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ హుజూరాబాద్ సీడీపీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పౌష్టికాహారంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో పద్మావతి, సర్పంచ్ శ్రీనివాస్, వైద్యాధికారి అరుణ్‌కుమార్, విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి, పోషణ్ అభియాన్ రమేష్, నాగరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూప, జ్యోతి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రామడుగు: మండలకేంద్రంలో పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కస్తూరి మాటాడుతూ.. అందరూ చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, రాగిజావ నిత్యం తీసుకోవాలని సూ చించా రు. స్వశక్తి మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల, సూపర్‌వైజర్ జయప్రద,అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

పంట నష్టంపై క్షేత్రస్థాయి సర్వే

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి గ్రామంలో అకాల వర్షాలకు నష్టం వాటిల్లిన పంటలపై వ్యవసాయశాఖ అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. వరితో పాటు మామిడి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. ఎకరాకు పదివేల పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.

అధికారుల తీరుపై రేపు ధర్నా

చొప్పదండి: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలపై సర్వే చేసేందుకు వచ్చిన వ్యవసాయ అధికారుల తీరుకు నిరసనగా సోమవారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో ధర్నా నిర్వహించనున్నామని రైతు ఐక్య సంఘం నాయకులు ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష నాయకులతో పాటు సీఎం కేసీఆర్ వచ్చి రైతులను ఓదార్చినా అధికారులు మాత్రం రారడం లేదని విమర్శించారు. వ్యవసాయాధికారులు కొందరికి మాత్రమే నష్టపరిహారం ఇస్తామంటున్నారని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలు అంటూ రైతుల పొట్ట కొడుతున్నారని, అధికారుల తీరుకు నిరసనగా జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని రైతు సంఘం అధ్యక్షుడు గుర్రం రవీందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొమురెల్లిరెడ్డి తదితరులు కోరారు.



గంగాధర: వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏఈవో

నిఘా నీడలో 'పది' పరీక్షలు

జమ్మికుంట: పది పరీక్షలకు ఏర్పాట్లు చేశామని, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో 3 నుంచి పరీక్షలు జరుగుతాయని ఎంఈవో విడుపు శ్రీనివాస్ అన్నారు. శనివారం పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. జమ్మికుంట పట్టణం, మండలంలో 949 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, గంట ముందుగా విద్యార్థులు సెంటర్‌కు హాజరు కావాలన్నారు.

ఇల్లందకుంట: పది పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు అవకాశం లేకుండా పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంఈవో విడపు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో 149 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎంఈవో



అన్నదానం చేస్తున్న సర్పంచ్ రావుల రమేశ్, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో శ్రీవీరాంజనేయ సహిత భవానీశంకరదేవాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిరణ్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించారు. సర్పంచ్ రావుల రమేష్, ఎంపీటీసీ కొత్త తిరుపతి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ నూనె సురేష్, వంగల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవ కమిటీ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని మున్సిపాలిటీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అధ్యక్షతన పూలే జయంతి ఉత్సవ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఖలీద్ హుస్సేన్, కమిటీ అధ్యక్షుడిగా బుర్ర కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షులుగా సామల లక్ష్మి నారాయణ, జె కె.ప్రభాకర్, చందు, ప్రచార కార్యదర్శిగా తులసి లక్ష్మణమూర్తి, కోశాధికారిగా ఎర్రబొజ్జు నారాయణ, సహాయ కార్యదర్శులుగా సొల్లు మహేందర్, ఎగ్గోజు ప్రసాద్, బండారి శ్రీనివాస్, గాలిబ్ శ్రీనివాస్, కక్కెర్ల సారయ్య, కార్యవర్గ సభ్యులుగా ప్రతాపగిరి శ్రీనివాస్, బొంగోని రవీందర్, కొలిపాక రమేష్, పి.రామాంజనేయులు, శనిగరం శ్రీనివాస్, ప్రతాప సతీష్, అనుదీప్, జె రవీందర్, పోనగంటి రాజ్‌కుమార్, ఎం మల్లేష్, ఎం.శ్రీధర్ ఎన్నికయ్యారు. నియామకం పట్ల పలు ప్రజాసంఘాల నాయకులు, పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు..

గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడిగా కనకయ్య



నూతన కమిటీ సభ్యులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సంఘం నూతన అధ్యక్షుడిగా వెల్మల కనకయ్యను సంఘం సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మి రుపాల్ల కనకయ్య, డైరెక్టర్లుగా తొంటి కొంరయ్య, ఎల్లమ్మల రాజయ్య, ఎల్కపల్లి కొంరయ్యను సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికల కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్కపల్లి లచ్చయ్య, సభ్యులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా వడ్లూరి రాజేంద్రాచారి



రామడుగు: రామడుగు విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా వడ్లూరి రాజేంద్రాచారిని సంఘం సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా ఉపాధ్యక్షుడిగా శ్రీరామోజు కిషన్, ప్రధాన కార్యదర్శిగా శెకల్ల సింహచారి, కోశాధికారిగా వడ్లూరి శ్రీనివాస్, జనరల్ మేనేజర్‌గా కట్ట శ్రీధర్ న్నికయ్యారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్ : పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ కొండాల్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా శనివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ కొండాల్‌రెడ్డిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ధర్నా



మాట్లాడుతున్న సంపతి ఉదయ్, గ్రామస్తులు

గన్నేరువరం: మండలంలోని యాస్వాడ గ్రామ మైసమ్మ గుట్ట నుంచి మానేరు డ్యామ్ కట్ట శ్మశాన వాటిక వరకు బ్రిడ్జి నిర్మించాలని బ్రిడ్జి నిర్మాణ పోరాట సమితి చైర్మన్ సంపతి ఉదయ్ కోరారు. శనివారం మైసమ్మ గుట్ట సమీపంలో ఆయా గ్రామస్తులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చారని, నాలుగేళ్లుగా అతీగతి లేదని విమర్శించారు. సుమారు కిలోమీటరున్నర బ్రిడ్జి నిర్మిస్తే గన్నేరువరంతో పాటు బెజ్జంకి, ఇల్లంతకుంట, కోహెడ మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు కరీంగనర్ వెళ్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. మండల అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని, అలాగే డ్యాం సమీపంలో 3,500 ఎకరాల ప్రభుత్వ భూమి వినియోగంలోకి వస్తదని పేర్కొన్నారు. మండలం నుంచి కరీంనగర్‌కు రెండు కిలోమీటర్ల దూరం ఉంటే 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. సుడా నిధులు నిధులు కేటాయించాలని, ఇచ్చిన హామీ ప్రకారం బ్రిడ్జి నిర్మించాలని లేకుంటే ధర్నా, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.

మహనీయుల జయంతికి ఏర్పాట్లు చేస్తాం



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కమిటీ అధ్యక్షులు, నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే జయంతి కమిటీ చైర్మన్లు ఎర్ర శ్రీధర్, ఇల్లందుల సమ్మయ్య, బుర్ర కుమార్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ... మహనీయుల జయంతిని మున్సిపాలిటీ తరఫున ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల రత్నం, బొరగాల సారయ్య, బొడ్డు ఐలయ్య, డాక్టర్ తడికమళ్ల శేఖర్, ఎర్ర రమేష్, రొంటాల బాబు, మాడుగుల ప్రవీణ్ కుమార్, తులసి లక్ష్మణమూర్తి, దాట్ల ప్రభాకర్, మేకల మల్లేశ్, మోరే మధు, తునికి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఎంపీపీ కేతిరెడ్డి వనిత

తిమ్మాపూర్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలంటే గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తిమ్మాపూర్ ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మహాత్మానగర్, నుస్తులాపూర్ గ్రామాల్లో కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2, ఆధ్వర్యంలో నాకోసం కాదు– మీకోసం అనే నినాదంతో రాజీవ్ రహదారికి ఇరువైపులా మొక్కల గుంతల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో కార్యక్రమ చేపట్టడం అభినందనీయమన్నారు.ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు. వారం రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచులు శ్రీవాణిరవీందర్, రమేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. మురళి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డా. టి. లావణ్య, ఎం. శకుంతల పాల్గొన్నారు.

'పార్లమెంట్ సభ్యత్వం రద్దు అనైతిక చర్య'

శంకరపట్నం: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు అనైతిక చర్య అని కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు అన్నారు. బీజేపీ ప్రభుత్వం అవినీతిపై ప్రశ్నించినందుకు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండించారు.

గంగాధర: అనర్హత వేటు ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మధురానగర్‌లోని పార్టీ కార్యాలయంలోమాట్లాడారు.

గన్నేరువరం: రాహుల్‌గాంధీపై బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ అన్నారు. మండలకేంద్రం గన్నేరువరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

మానకొండూర్: భారత్ జోడో యాత్రను ఓర్వలేక బీజేపీ రాహుల్‌గాంధీపై కక్ష కట్టిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎం. రోహిత్‌రావు ఆరోపించారు. మండల కేంద్రంలో మాట్లాడారు.

తిమ్మాపూర్: రాహుల్ గాంధీపై అనర్హత వేటు రాజ్యాంగ విరుద్ధం అని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్ అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీ శ్రీతాపాలా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం మాట్లాడారు.

చిగురుమామిడి: అనర్హత వేటు అవివేకమైన చర్య అని కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వ నియంతృత్వ పోకడలకు, ఆహంకారానికి ఇది నిదర్శనమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899